
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

బుధవారం 19 నవంబరు 2025

పారిశ్రామిక రంగంపై నిరుద్యోగ్య యువత దృష్టి సారించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ్య యువత పారిశ్రామిక రంగంపై దృష్టి సారించి ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ హనుమంతు కోరారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో రాంప్ ప్రాజెక్టులో భాగంగా సిరిసిల్ల టీం సభ్యులకు పీఎంఈజీపీ పథకంతోపై అవగహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుద్యోగ్య యువతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన సంక్షేమ పథకాలపై అంజనేయులు, వెంకటరమణలు అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో జనరల్ మేనేజర్ హనుమంతు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంఈజీపీ, పీఎంఈఎంఈ, పీఎం విశ్వకామ పథకాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఎంఎ భారతి, ఈడీసీ మేనేజర్ జయంత్, అసిస్టెంట్‌మేనేజర్ వెంకట శివసాయిలు పాల్గొన్నారు.

ప్రతిపాదనల ఆహ్వానం

సిరిసిల్ల టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని నిరాశ్రయుల వసతి భవనం నిర్వహణకు మహిళా సంఘాలు, ఎన్‌జీవోలు ప్రతిపాదనలు ఆహ్వానిస్తున్నామని మంగళవారం సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖాదీర్‌పాషా తెలిపారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన ఆసక్తి గల మహిళా సంఘాలు, ఎన్‌జీవోలు ఈనెల 20న సాయంత్రం 5లోపు మున్సిపల్ కార్యాలయం మెప్మా విభాగంలో ప్రతిపాదనలను అందజేయాలన్నారు.



పల్లెపోరు వైపు నేతల చూపు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

- జిల్లా కాంగ్రెస్‌లో జూబ్లీహిల్స్ జోష్
- స్థానిక ఎన్నికల్లో జెండా ఎగరవేస్తామనే ధీమా
- జిల్లాలో ఆశావహులను పెంచిన జూబ్లీహిల్స్ గెలుపు
- మళ్లీ ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం దృష్టి

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్న ఆశావహుల సంఖ్య రాజన్న సిరిసిల్ల జిల్లాలో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక గెలుపు మరింత పెంచింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డితో పాటు జిల్లా ముఖ్య నాయకులు రాజధానిలో మకాం వేసి విస్తృతంగా ప్రచారం చేశారు. కాంగ్రెస్ ఉపఎన్నికల్లో గెలవడంతో రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ నాయకుల్లో ఉత్సాహాన్ని నింపింది. జిల్లాలో జడ్పీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు సిద్ధమవుతున్న ఆశావహులకు ఉపఎన్నిక మరింత జోష్ నింపింది. ఇదే ఊపుతో స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఉప ఎన్నికల ఫలితాలతో ఆశావహులు పెరగడంతో అభ్యర్థుల ఎంపిక తలనొప్పిగానే మారుతుందని అభిప్రాయం కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో వ్యక్తం అవుతోంది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలకు నిన్న, మొన్నటి వరకు దూరంగా ఉన్న వారు సైతం ఇప్పుడు మళ్లీ తెరపైకి వస్తున్నారు. మరోవైపు క్యాబినెట్ స్థానిక ఎన్నికలపై స్పష్టత ఇవ్వడమే కాకుండా ముందుగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించే విధంగా తీర్మానించడంతో రాజన్న సిరిసిల్ల జిల్లా గ్రామాల్లో సందడి మొదలైంది. సుప్రీంకోర్టు 50 రిజర్వేషన్లకు మించి ఉండకూడదనే ఆదేశాలను పరిగణనలోకి తీసుకొని కాంగ్రెస్ పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించారు. దీంతో పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు జరగనుండటంతో గ్రామాల్లో ఆశావహుల హడావుడి జోరందుకుంది.

జిల్లాలో 260 సర్పంచులు.. 2,268 వార్డు సభ్యులు

పంచాయతీ ఎన్నికలకు త్వరలోనే నోటిఫికేషన్ వెల్లడి కానుండడంతో రాజన్న సిరిసిల్ల జిల్లా అధికార యంత్రాంగం మరోసారి ఏర్పాట్లపై దృష్టి పెట్టింది. ఈ ఆర్థిక సంవత్సరం మూగిసే సమయానికి పంచాయతీ ఎన్నికలు నిర్వహించకుంటే నిధులు కోల్పోయే ప్రమాదం ఉండడంతో పంచాయతీ ఎన్నికలు ముందుగా నిర్వహించే విధంగా ప్రభుత్వం దృష్టి పెట్టింది. దీంతో పల్లె పోరు ఖాయమని తేలిపోయింది. జిల్లాలో 260 గ్రామపంచాయతీలు, 2268 వార్డు సభ్యులు ఉండగా ఇప్పటికే 1734 పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి 200 మంది ఓటర్లు ఉన్నవరకు 1734 పోలింగ్ కేంద్రాలు, 400 ఓటర్ల వరకు 468 పోలింగ్ కేంద్రాలు, 650 ఓటర్ల వరకు ఉన్న పంచాయతీల్లో 76 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పంచాయతీ ఎన్నికల్లో 650 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రాన్ని సిద్ధం చేస్తున్నారు. అంతకుమించి ఓటర్లు ఉంటే రెండవ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తారు. 200 మంది ఓటర్లు ఉన్న చోట ఒక ప్రిసైడింగ్ అధికారి ఒక పోలింగ్ అధికారి ఉంటారు. 201 నుంచి 400 వరకు ఒక ప్రిసైడింగ్ మిగతా 8లో..

ఆయిల్‌పామ్ పంట విస్తీర్ణం పెంపునకు ప్రణాళికలు

- ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆయిల్‌పామ్ పంట విస్తీర్ణం పెంపునకు పటిష్టమైన ప్రణాళికలను అమలు చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణ లక్ష్యాల సాధనపై ఉద్యానవనశాఖ, వ్యవసాయ శాఖ, సహకార శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ దేశ అవసరాలకు సరిపడా వంటనూనె మన దగ్గర పండటం లేదని, విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఉందని, దీనివల్ల దేశానికి కోట్లలో నష్టం వస్తుందన్నారు. ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణ పెరగడం వల్ల రైతులకు అధిక లాభం రావడం తోపాటు దేశానికి ఎంతో మేలు చేకూరుతుందన్నారు. జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి 4వేల ఎకరాల్లో పంట సాగు విస్తీర్ణం లక్ష్యమని తెలిపారు. సాగుపై ఆసక్తిగా ఉన్న రైతుల రిజిస్ట్రేషన్, పరిపాలన మంజూరు ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలని సూచించారు. జూలై నుంచి ఇప్పటివరకు 67 మంది రైతుల నుంచి 257 ఎకరాలల్లో 110 టన్నులు సేకరించి రూ 19, 681 టన్నుకు మద్దతు ధర వచ్చిందని ప్రీయానిక్ కంపెనీ సేకరించడం జరిగిందన్నారు. సిద్దిపేట జిల్లాలో కంపెనీ ఉందనిరైతులు పంట విక్రయించేందుకు ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. ఆయిల్‌పామ్ పంట సాగుతో లాభాలు సాగు విధానం మద్దతు ధర, తదితర అంశాలపై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి లత, జిల్లా సహకారశాఖ అధికారి రామకృష్ణ, ఉద్యానవన శాఖ అధికారులు గోవర్ధన్, లోకేష్, కంపెనీ ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన వస్తువులు, పరికరాలను సరఫరా చేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఎస్సీ వసతి గృహాలకు నాణ్యమైన వస్తువులు, పరికరాలను సరఫరా చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ టెండర్‌దారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశమందిరంలో మంగళవారం టెండర్‌లను ఓపెన్ చేశారు. ఎస్సీ వసతిగృహాల్లో విద్యార్థులకు అందించే జామెట్రీ బాక్స్‌లు, స్కేల్‌లు, వరల్డ్ మ్యాప్‌లు, వాటర్‌బాటిల్‌లు, అల్‌ఇన్ వన్ బుక్స్ స్టడీచైర్‌లు దుప్పట్లు, మెత్తలు, సీసీకెమారాలు, రగ్గులను పరిశీలించి వాటి ధరల విరాలను అడిగి తెలుసుకుని ఫైనల్ చేశారు. టెండర్‌దారులు వారంలోగా వస్తువులు, పరికరాలను అందించాలని అధికారులు వాటిలో నాణ్యతను పరిశీలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి, నాణ్యత కమిటీ సభ్యులు హనుమంతు, స్వప్న, ఏఎస్‌డబ్ల్యూవో విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాజన్నసిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షుడు దేవేందర్ డిమాండ్ చేశారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత, పీఎంశ్రీ ప్రాథమిక పాఠశాలలో ఆ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ పీఆర్సీ ప్రకటించడంతో పాటు డీఏలను మంజూరు చేయాలని అన్నారు. కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల వేతనాలను సకాలంలో చెల్లించాలని అన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో అర్హులైన 50 మంది లబ్ధిదారులకు 17లక్షల 30వేల విలువగల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం ఆయన చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ ఛైర్మన్ మల్లేశం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చింతపటి రామస్వామి, నాయకులు భీమరాజు కనకరాజు, ముకుంద రెడ్డి, ప్రభాకర్, సత్తయ్య, శంకరయ్య, శ్రీనివాస్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

● రుద్రంగి : మండలకేంద్రంలోని రైతువేదికలో మంగళవారం 18మంది లబ్ధిదారులకు రూ.6లక్షల వలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్దిదారులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, మాడిశెట్టి అభిలాష్, తర్రె లింగం, బైరి గంగమల్లయ్య, పోగుల మహేష్, చెలుకల శ్రీకాంత్, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

గర్ల్స్ కన్వెన్షన్‌ను విజయవంతం చేయాలి

వేములవాడ టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌లో ఈనెల 26నుంచి 28వరకు జరిగే ఎస్ఎఫ్ఐ రాష్ట్రస్థాయి గర్ల్స్ కన్వెన్షన్‌ను విజయవంతం చేయాలని జిల్లా కన్వీనర్ శ్రీరాముల సంజన కోరారు. మంగళవారం వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కమిటీ ఆధ్వర్యంలో బెలూన్స్ ఎగురవేత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా విద్యార్థినుల హక్కులు, భద్రత, విద్యా అవకాశాలపై అవగాహన కల్పించే వేదికగా నిలుస్తుందన్నారు. ఎస్ఎఫ్ఐ కళాశాల గర్ల్స్ కమిటీ నాయకులు దీక్షిత, వైష్ణవ, సన, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని తరలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే అదిశ్రీనివాస్



అధికారులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని తరలించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కోరారు. సిరిసిల్ల కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలింపుపై అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించగా ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్‌తో సమీక్షించారు. జిల్లాలో ఇప్పటివరకు లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని అధికారులు వివరించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రైతులు ధాన్యం విక్రయించడంలో ఇబ్బందులు పడవద్దని సీఎం రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారని గుర్తుచేశారు. కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని తరలించేందుకు ఒప్పందం చేసుకున్న లారీ కాంట్రాక్టర్ జిల్లాలోని ఐదు రూట్లలో దాదాపు 500 లారీలను సమకూర్చాల్సి ఉంటుందని తెలిపారు. ఇప్పటికిప్పుడు ధాన్యం తరలింపునకు ప్రత్యామ్నాయంగా లారీలను సిద్ధంగా ఉంచాలన్నారు. రైస్ మిల్లులలో కూలీల ఇబ్బంది లేకుండా కూడా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్‌డీవో శేషాద్రి, డీసీఎస్‌వో చంద్రప్రకాష్, జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం, డీసీవో రామకృష్ణ, డీటీవో లక్ష్మణ్, మార్కెటింగ్ జిల్లా అధికారి ప్రకాష్, మార్క్‌ఫెడ్ అధికారి హబీబ్, మెప్మ ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య సేవలపై అవగాహన కల్పించాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



రికార్డులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్

సిరిసిల్ల టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ నగర్‌లోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఇన్‌చార్జి కలెక్టర్ తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఓపీ రిజిష్టర్, ల్యాబ్, పార్మసీ, ఇమ్యూనైజేషన్ గది, ఇన్ పేషెంట్ గదులు, ఆసుపత్రుల ఇతర గదులతో పాటు ఆవరణను పరిశీలించారు. వైద్య సేవల కోసం ఆసుపత్రులకు వచ్చిన రోగులతో మాట్లాడారు. ఆసుపత్రులలో వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది నిత్యం ఆసుప త్రిలో అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్య సేవ లందించాలన్నారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై జాగ్రత్తలు వహించాలన్నారు. గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

● సిరిసిల్ల రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలపై ప్రజ లకు అవగాహన కల్పించడంతోపాటు వారికి మెరుగైన వైద్యం అందిం చాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల అర్బ న్ పరిధిలోని కార్మిక క్షేత్రం రాజీవ్‌నగర్‌లోని బస్తీ దవాఖానను మంగ ళవారం ఇన్‌చార్జి కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖానలో అందిస్తున్న వైద్యసేవల వివరాలను అడిగి తెలుసుకుని, ఓపీ రికార్డుల ను పరిశీలించారు. ల్యాబ్, ఫార్మసీ, ఇమ్యూనైజేషన్, ఇన్‌పేషెంట్ గదు లతోపాటు పరిసరాలను పర్యవేక్షించారు. సీజనల్ వ్యాధులపై బస్తీ దవాఖానకు వచ్చేవారికి అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యు లు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు.

జిల్లాలో 8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు..

సిరిసిల్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో గత నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పడిపోతున్నాయి. మంగళవారం జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రత 8.0 డిగ్రీలుగా ఉండగా, గరిష్ఠ ఉష్ణోగ్రత 31.8 డిగ్రీలుగా నమోదయింది. అత్యల్పంగా జిల్లాలో రుద్రంగిలో 8.0 నమోదయింది. గంభీరావుపేటలో 9.0 డిగ్రీలు, బోయిన్‌పల్లిలో 9.6 డిగ్రీలు, తంగళ్ళపల్లి, వీర్నపల్లిలో 10.5 డిగ్రీలు, కోనరావుపేటలో 10.6 డిగ్రీలు, వేములవాడ రూరల్‌లో 10.9 డిగ్రీలు సిరిసిల్లలో 11.1 డిగ్రీలు, వేములవాడ,ఇంతకుంటలో11.4 డిగ్రీలు, చందుర్తిలో 11.9 డిగ్రీలు, ఎల్లారెడ్డిపేటలో 12.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రోజురోజుకు చలి తీవ్రత పెరుగుతుండడంతో జిల్లాలోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో ఇళ్లకే పరిమితమవుతున్నారు.

భారతీయ సంస్కృతి, సనాతన ధర్మమే మన బలం

- కుటుంబ వారసత్వ రాజకీయాలతో దేశానికి ముప్పు
- యువకులూ.. రాజకీయాల్లోకి రండి..
- సర్దార్ పటేల్ స్ఫూర్తితో విచ్ఛిన్న శక్తుల ఆట కట్టిద్దాం
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- సిరిసిల్లలో ఉత్సాహంగా యూనిటీ మార్చ్



సిరిసిల్లలో యూనిటీ మార్చ్

సిరిసిల్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు పాకిస్తాన్ వంటి ఉగ్రవాద దేశాలు కుట్ర చేస్తున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయి పటేల్ 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం జిల్లా కేంద్రంలో నెహ్రూ యువ కేంద్రం, మేరా భారత్ ఆధ్వర్యంలో సర్దార్-150 యూనిటీ మార్చ్ పేరిట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్, ఎస్పీ మహేశ్ తదితరులు పాలొన్నారు. ఒగ్గు డోలు ప్రదర్శన, విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయం, సనాతన ధర్మమే భారతదేశానికి బలమని, మనమట్టిలోనే ఆ బలం ఉందన్నారు. కుటుంబ రాజకీయ వారసత్వ రాజకీయాలతో దేశానికి ప్రమాదమని, యువత రాజకీయాల్లోకి రావాల్సిన వచ్చి రాజకీయ సమీకరణలను మార్చాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కుటుంబంలో విబేధాలుంటే పక్కనున్న వాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుని లాభం పొందాలనుకుంటారు. అట్లాగే దేశం ఐక్యంగా లేకపోతే... పక్కనున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్ వంటి ఉగ్రవాద దేశాలు దేశ ఐక్యతను దెబ్బతీసి విధ్వంసం చేసేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. భారత్‌ను అన్ని విధాలా అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. అమెరికా వంటి పాశ్చాత్య దేశాల రూపంలో, పాకిస్తాన్ వంటి ఉగ్రవాద దేశాల రూపంలో మన భారతీయ సనాతన ధర్మానికి, కుటుంబ వ్యవస్థకు పెను ప్రమాదం ఎదురు కాబోతోందన్నారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో దేశం అన్ని రంగాల్లో దూసుకుపోతోందని. దేశ ప్రజల కోసం సర్దార్ పటేల్ చేసిన త్యాగాలను, కనబర్చిన ధైర్య, సాహసాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న బండి సంజయ్

ఉగ్రవాద మూకల వలలో యువత

కొందరు తెలిసోతెలియక అమాయక యువత పాకిస్తాన్ వంటి ఉగ్రవాద మూకల వలలో పడి వాళ్ల జీవితాలను, వాళ్ల కుటుంబాల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని సంజయ్ అన్నారు. ఇంకొందరు కార్పొరేట్ కల్చర్ పేరుతో డ్రగ్స్ పబ్ కల్చర్‌కు అలవాటుతో తమ భవిష్యత్తును సర్వనాశనం చేసుకుంటున్నారని అన్నారు. భారత్‌లో డ్రగ్స్‌మద్యం, గంజాయి వంటి వ్యసనాలవల్ల దాదాపు 5.70 కోట్ల మంది నష్టపోతున్నారన్నారు. ఉగ్రవాదం ఉచ్చులో పడి ఏటా వందల మంది బలైపోతున్నారని. గత దశాబ్దంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం ఆర్థిక ప్రగతి సాధించిందని, ఆర్థిక ప్రగతిలో 4వ స్థానానికి చేరుకున్నామని, స్వావలంబనలో ఊహించనంతంగా ముందుకు పోతున్నామన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి..

దేశానికి యువతే బలం. యువతతోనే దేశ ఐక్యత సాధ్యం. కాబట్టి యువత తప్పనిసరిగా రాజకీయాల్లోకి రావాలి. లేనిపక్షంలో కుటుంబ వారసత్వ రాజకీయాలే కొనసాగుతాయని సంజయ్ అన్నారు. యువత రాజకీయాల్లోకి వచ్చి రాజకీయ సమీకరణలను మార్చడం ద్వారానే దేశాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతూ ఐక్యంగా ఉంచగలమన్నారు. ఈనాటి యువత డ్రగ్స్‌పబ్, మద్యం, కార్పొరేట్ కల్చర్ వలలో పడి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, హైదరాబాద్ పాతబస్తీలో ఓ స్కూల్‌ను టార్గెట్ చేసుకుని బాలికలను డ్రగ్స్‌కు అలవాటు చేసి వారి జీవితాలనే నాశనం చేస్తున్నారని. తెలిసో తెలియక యువత వారి వలలో పడుతున్నారని, ఈ పరిస్థితి మారాలంటే యువత రాజకీయాల్లోకి రావాలన్నారు. డ్రగ్స్‌పై యుద్ధం ప్రకటిద్దామన్నారు. డ్రగ్స్‌ను ఉక్కుపాదంతో అణచివేసేందుకు మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఉద్యమంలో యువత భాగస్వాములైతే.. డ్రగ్స్ రహిత దేశం ఎంతో దూరంలో లేదన్నారు.

పటేల్‌ను ఆదర్శంగా తీసుకోవాలి.

యువతకు ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయి పటేల్‌ను ఆదర్శంగా, ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సంజయ్ అన్నారు. దేశంలో ఆ ధునిక సివిల్ సర్వీసెస్ వ్యవస్థను స్థాపించడంలో పటేల్ కీలక పాత్ర పోషించారన్నారు. నేటి యువతకు పటేల్ స్ఫూర్తిదాయకమన్నారు. ఆయనలోని ఆలోచనలు, ఆశయాలను, క్రమశిక్షణ, దేశభక్తిని ఈనాటి యువత అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని, అలాంటి మహనీయుడిని 150 జయంతి సందర్భంగా ప్రతిఒక్కరూ స్మరించుకునేలా ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అక్టోబరు 31 నుంచి నవంబరు 25వరకు సర్దార్-150 ఐక్యతా మార్చ్ పేరిట అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. విద్యార్థులను, యువతతో కలిసి ఎంపీలు,కేంద్ర మంత్రులు పాదయాత్రలు చేస్తున్నారని, జిల్లాలో పాదయాత్రలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ దేశ ఐక్యత, అభివృద్ధికి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఎంతో కృషి చేశారన్నారు. పటేల్ కృషితోనే దేశంలో వివిధ సంస్థానాలు కలిశాయని వివరించారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మట్లాడుతూ విద్యాశాఖ, ఇంటర్, డిగ్రీ కళాశాలలు, జిల్లా సంక్షేమ శాఖ, పోలీసుల సమన్వయంతో జిల్లాను డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. డ్రగ్స్‌తో కలిగే నష్టాలు ఇబ్బందులపై అవగాహన కలిగించేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. దేశ ఐక్యత, అభివృద్ధికి సర్దార్ వల్లభాయ్ పటేల్ అందించిన సేవలను కొనియాడారు. ఎస్పీ మహేష్ బీ గితే మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా డ్రగ్స్ వ్యాప్తి చేస్తున్న సమాచారం ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. డ్రగ్స్‌రహిత జిల్లా కోసం ప్రణాళిక ప్రకారం ముందుకు వెళుతున్నామని తెలిపారు. వైద్య కళాశాల విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బండి సంజయ్ భరోసా ఇచ్చారు. ఫ్లాష్ మాబ్ ద్వారా ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి రాంబాబు, ఆర్డీవో వేంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ చంద్రయ్య, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూపరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, వేములవాడ ఇన్‌చార్జి డాక్టర్ చెన్నమనేని వికాస్‌రావు, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు ప్రతామరామకృష్ణ, డీవైఎస్‌వో రాందాస్, డీఐఈవో ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్‌పాషా, తహసీల్దార్ మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, ALLAVENI SAMMAIAH, S/O. GATTAIAH, R/O. H.NO. 4-2-11/B, VARTHAKA SANGAM VEEDHI, JAMMIKUNTA, KARIMNAGAR. HAVE CHANGED MY NAME AS " ELLAVENI SAMMAIAH " S/O. ELLAVENI GATTAIAH.

AJK-17457

CHANGE OF NAME

★ I, MOHAMMED KALEEMUDDIN F/O. "KHAJA MOHIUDDIN" & M/O." AHEMADI BEGUM", R/O. H.NO: 10-58/F/3, MAHABOOB COLONY, ROAD NO-1, KARIMNAGAR. I HAVE CHANGED AS "MOHAMMED KALEEMUDDIN" F/O. LATE "KHAJA MOINUDDIN"& M/O. LATE"AHMEDAI BEGAM".

AJK-17458

CHANGE OF NAME

★ I, JAFEER AHMED ASADI, S/O. RASHEED ABDUL, R/O. H.NO. 4-52/10/A/3/A, Dharoor Camp, Jagtial Town & District: 505327. I HAVE CHANGED MY NAME AS " ZAFEER AHMED ASADI " S/O. RASHEED ABDUL.

AJK-250649

CHANGE OF NAME

I, MENDE MALLAMMA, W/o. RAYAMALLU, H.NO. 7-26, Vill: Annaram, Mdl: Manakondoor, Dist: Karimnagar. HAVE CHANGED MY NAME AS" MENDE MALLAVVA " W/o. RAYAMALLU.

AJK-250978

CHANGE OF NAME

PURUMANI SAMBA REDDY, S/O: RAJI REDDY, H.No:4-41, VILLAGE: VEDIRA, MANDAL: RAMADUGU, DIST: KARIMNAGAR, SHALL HENCE FORTH BE KNOW AS PURUMANI SAMBAIAH (NEW NAME) FOR ALL FUTURE PURPOSE

AJK-250924

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటన దారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

3+2 స్కీం కలదు

ఆంధ్రజ్యోతి ప్రకటనలకై సంప్ర: 99854 11174

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

కరీంనగర్ :- సెల్: 9703618691, 99854 10640

జగిత్యాల, మెట్‌పల్లి :- సెల్ : 99854 11262

వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063

పంచాయతీ పైపులు మాయం

- పోలీసులకు ఫిర్యాదు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబరు18(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామ పంచాయతీకి సంబంధించిన తాగు నీటి పైపులు మాయమయ్యాయి. సుమారు 30 పైపులు కనిపించకుండాపోయాయి. విషయం తెలుసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మంగళవారం ఆరా తీశారు. మండలంలోని గర్జనపల్లికి చెందిన రైతు బంతిలాల్ వ్యవసాయ పొలంలో పైపులు వేస్తుండడాన్ని గమనించారు. ఎక్కడి నుంచి తీసుకువచ్చారని ప్రశ్నించారు. సదరు రైతు నుంచి పైపులను స్వాధీనపర్చుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనిల్ వివరించారు. గ్రామంలోని ఓ పార్టీ నాయకుడు పంచాయతీ పైపులను ఒక్కో దానికి రూ.వేయి చొప్పున సుమారు 90 పైపులను విక్రయించారని విచారణలో తేలినట్లు సమాచారం.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

ఎల్లారెడ్డిపేట, నవంబరు18(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో అద్దెకు ఉంటున్న మదురాల నర్సయ్య ఇల్లు ప్రమాదవశాత్తు మంగళవారం దగ్ధమైంది. తాళం వేసిన ఇంటి గదుల నుంచి మంటలు వ్యాపించడంతో చుట్టు పక్కల వారు ఆయనకు సమాచారం అందించారు. అక్కడి చేరుకునే సరికి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. చుట్టుపక్కల వారు ఆర్పేందుకు యత్నించారు. ఇంటిలోని విలువైన పత్రాలు, వస్తువులు కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు చేరుకుని స్థానికుల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఘటనలో సుమారు రూ.2లక్షల నష్టం వాట్లిందని బాధితులు పేర్కొన్నారు.

15 మందికి జరిమానా

ఇల్లంతకుంట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలలో మద్యంసేవించి వాహనాలు నడిపిన 15మందికి జరిమానా విధించినట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం కోర్టు కానిస్టేబుల్స్ తిరుపతి, జీవన్ మద్యంసేవించి వాహనాలు నడిపిన వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చారు. జిల్లా సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ జయశ్రీ 12మందికి రూ.1000, మరో ముగ్గురికి రూ 5వేల చొప్పున జరిమానా విధించారు.

గోదావరిలో దూకి యువకుడి ఆత్మహత్య


ధర్మపురి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి గోదావరి నదిలో దూకి పంపరి అజయ్ (34) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. హుజూరాబాద్‌కు చెందిన అజయ్ తల్లి ఇటీవల మృతిచెందగా అజయ్ ఇంటిలో ఒంటరిగా ఉంటున్నాడు. ఈ నెల 11న తల్లి పెద్ద ఖర్మ ఉండగా 9న అజయ్ ధర్మపురికి వచ్చాడు. అదే రోజు గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. రాయపట్నం వద్ద గోదావరి నదిలో మంగళవారం మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. అజయ్ సోదరి రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

పీజీ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల


ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ వరలక్ష్మి

గణేశ్‌నగర్, నవంబరు18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కరీంనగర్ ఆగస్టులో నిర్వహించిన పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల రెండో సెమిస్టర్ ఫలితాలను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.వరలక్ష్మి మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ జి. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. కళాశాలలో ఉన్న ఏడు పీజీ కోర్సుల్లో 95 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో విద్యార్థినులకు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల పరీక్షల అదనపు నియంత్రణాధికారులు పాల్గొన్నారు.

- చిన్నచిన్న కారణాలతో కుటుంబసభ్యుల హత్యలు
- కాలయములుగా మారుతున్న కన్నవారు



కరీంనగర్ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో నానాటికి పెరిగిపోతున్న నేరాల తీవ్ర తను చూస్తే మనుషుల విపరీతమైన నేర ప్రవర్తనపై అసహ్యం వేస్తున్నది. మనుషుల మధ్య ప్రేమలు, ఆప్యాయతలు, అనురాగాలు మాయమవుతున్నాయి. మనుషులు డబ్బులు, సంపదపై మమ కారాన్ని పెంచుకుంటుండంతో మానవ సంబంధాలు మాయమవుతున్నాయి. భర్తను భార్య హత మార్చడం, భార్యను భర్త హత్య చేయడం, తండ్రిని కొడుకు, కొడుకు, కూతుర్లను తండ్రి చంపడం వంటి ఘటనలు అందరిని కలచి వేస్తున్నాయి. నాగరిక సమాజంలో ఆటవికమైన నేర ఘటనలు చోటు చేసు కోవడం విచారకరం. జిల్లాలో ఇటీవల జరుగుతున్న వరుస సంఘటనలు సర్వత్రా ఆందోళన రేకెత్తిస్తు న్నాయి.

- దివ్యాంగులైన పిల్లలను వదిలించుకునేందుకు..

తాజాగా కన్నతండ్రే దివ్యాంగులైన కన్న కూతురిని హత్య చేసి, కొడుకును హత్య చేసేందుకు యత్నించిన ఘటన కరీంనగర్‌లో చోటు చేసుకుంది. కన్న పిల్లలను అల్లారుముద్దుగా చూసుకోవాల్సిన తండ్రే ఆ దివ్యాంగుల పాలిట కాలయముడవ డం దారుణం. పోషణ భారమవతున్నదనే కారణంగానే తన కూతురు, కొడుకును కనికరం లేకుండా విషంఇచ్చి హతమార్చే యత్నం చేశాడు. అది విఫలమవటంతో టవల్‌తో గొంతుకు ఉరిబిగించి చంపాలని ప్రయత్నించాడు. కూతురు మరణించింది. కొడుకు కొన ఊపిరితో ఆసుపత్రిలో ప్రాణాలతో పోరాడుతున్నాడు. అనంతరం తండ్రి మల్లేశం ఇంటి నుంచి పరారుకాగా రెండు రోజుల తరువాత త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు.

- మరో ఘటనలో 2020 ఫిబ్రవరి 10న కరీంనగర్‌లోని విద్యాగనర్ ప్రాంతంలో ఇంటర్ చదువుతున్న ముత్త రాధిక(17) అనే దివ్యాంగులరాలిని ఆమె కన్న తండ్రి కొమురయ్య కత్తితో గొంతుకోసి దారుణంగా హత్య చేశాడు. ఆపై గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారంటూ కన్నీటిపర్యంతమయ్యాడు. సంఘటనా స్థలంలో సీసీ కెమెరాలు, సెల్‌టవర్ డంపును పరిశీలించిన పోలీసులకు అనుమానంవేసి లోతుగా విచారణ జరపగా తండ్రే హత్య చేసినట్లు వెల్లడైంది. నిందితుడు ఘటనస్థలంలో ఎలాంటి ఆధా రాలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ అప్పటి పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి హైదరాబాద్ నుంచి జర్మన్ సాంకేతిక పరిజ్ఞానంతో కీలక ఆధారాలను సేకరించారు. ఎంత డబ్బు ఖర్చుచేసినా దివ్యాంగురాలి ఆరోగ్యం బాగుపడటంలేదని హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ రెండు ఘటనల్లో తండ్రులైన నిందితులు కన్నకూతుర్లను అల్లారు ముద్దుగా చూసుకోవాల్సిందిపోయి, చిన్నతనం లో గోరుముద్దలు తినిపించిన తండ్రులే అవే చేతులతో కర్కశంగా చంపివేశారు. జిల్లాలో జరిగిన ఈ రెండు ఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించాయి.

- ఆస్తి తగాదాలతో

జిల్లాలో ఆస్తి తగాదాలతో తండ్రులను కొడుకులు హతమార్చటం, సోదరులు ఒకరిని ఒకరు చంపటం, వివాహేతర సంబంధాలతో భార్య భర్తను, భర్త భార్యను, ప్రియురాలిని హత్య చేసిన ఘటనలు చాలానే జరిగాయి. ఇటీవల కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళ వివాహేతర సంబంధంతో ప్రియుడితో కలిసి మద్యంలో పురుగుమందు తాగించి భర్తను హత్య చేయించింది.అంతకు ముందు భగత్‌నగర్‌లో ప్రియురాలిని ప్రియుడు ఇంటికి పిలిచి బండరాయితోబాది హత్య చేశాడు. కొన్నేళ్ల క్రితం భగత్‌నగర్ ప్రాంతంలో దంపతుల నిద్రకు ఆటంకం కలిగిస్తూ రాత్రివేళ ఏడుస్తున్నదనే కారణంగా ఏడాది వయస్సున్న చిన్నారిని కన్నతల్లి నీటి సంపులో వేసి చంపింది. విద్యానగర్ ప్రాంతంలో ఆస్తి తగాదాలతో సోదరుడిని అతనిసోదరే రోకలిబండతో బాదిహత్య చేసింది.

వరుస చోరీలతో బెంబేలు

గన్నేరువరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. సోమవారం రాత్రి మండల కేంద్రంలో రంగనవేని మల్లయ్యకు చెందిన రెండు దూడలను దొంగలు ఎత్తుకెళ్లారు. వాటి విలువ సుమారు 50 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. అదే రాత్రి మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న హనుమాన్ ఆలయంలోని పెద్ద కంచు గంటను దొంగిలించారు. స్థానిక భక్తులు మంగళవారం ఉదయం చోరీకి గురైనట్లు గుర్తించారు. అదే ఆలయంలో గతంలో హుండీని దొంగలు ఎత్తుకెళ్లారు. మూడు రోజుల క్రితం గునుకుల కొండాపూర్‌లో పలువురు రైతులకు చెందిన నాలుగు ఆవులను దొంగలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. నగునూర్, బొమ్మకల్ లారీ అసోసియేషన్ వద్ద ట్రాక్టర్లను పట్టుకున్నట్లు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గన్నేరువరం : అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మండలంలోని గుండ్లపల్లి వద్ద పట్టుకున్నట్లు ఎస్సై నరేందర్ రెడ్డి తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం. మంగళవారం మండలంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గుండ్లపల్లి హనుమాన్ ఆలయం వద్ద ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను తనిఖీ చేసినట్లు చెప్పారు. సరైన పత్రాలు లేకపోవడం, అక్రమంగా ఇసుక తరలిస్తుండడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

- వైద్యుడి నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన


వేదాన్స్(ఫైల్)

కోరుట్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం వేదాన్స్ (5) అనే బాలుడు మృతి చెందాడు. వైద్యుడి నిర్లక్ష్యంతోనే బాలుడు మృతి చెందాడని ఆరోపిస్తూ ఆసుపత్రిలో కుటుంబసభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయికల్‌కు చెందిన పొలాస విజయ్-నందిత దంపతులు కుమారుడు వేదాన్స్‌తో కలిసి పట్టణంలోని ప్రకాశం రోడ్డులో ఉంటున్నారు. సోమవారం తీవ్ర జ్వరంతో బాధపతుండంగా వేదాన్స్‌ను కోరుట్ల పట్టణంలోని ఓ ప్రైవేట్ చిల్డ్రన్స్ ఆసుప్రతిలో చికిత్స కోసం తీసుకు వచ్చారు. బాలుడిని పరీక్షించిన వైద్యుడు మందులు రాసి ఇవ్వగా ఇంటికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో రాత్రి సమయంలో వేదాన్స్‌కు తీవ్ర జ్వరం రాగా మరోమారు ఆసుపత్రికి తీసుకువచ్చారు. పరీక్షలు నిర్వహించిన వైద్యుడు ఆసుపత్రిలో అడ్మిట్ చేయాలని సూచించగా తల్లిదండ్రులు సమ్మతించకపోవడంతో మరోమారు మందులను ఇచ్చి పంపాడు. మంగళవారం ఉదయం వేదాన్స్ తీవ్ర అస్వస్థతకు గురికాగా బంధువులు ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో వైద్యుడు బాలుడికి వైద్యం అందిస్తున్న సమయంలో మరింత తీవ్ర అస్వస్థతకు గురికాగా వైద్యుడు సీపీఆర్ చేసి రికవరీకి ప్రయత్నించాడు. అదే సమయంలో బాలుడు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బంధువులకు సమాచారం అందించారు. ఆసుపత్రికి చేరుకున్న బంధువులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ చిరంజీవి తన సిబ్బందితో అక్కడ చేరుకుని వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు అంజిరెడ్డి, మెడికల్ అధికారి ఉపెందర్‌లు ఆసుపత్రికి చేరుకొని బాలుడిని పరిశీలించి శాంపిల్స్ సేకరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యుడు మాట్లాడుతూ తాను చేసిన వైద్యంలో ఎలాంటి పొరపాటు లేదని, బాలుడిని ఆసుపత్రిలో ఉంచాలని తల్లిదండ్రులను కోరినప్పటికీ చేర్పించలేదని తెలిపారు. చివరికి స్థానిక ఐఎంఏ సభ్యులు మృతుడి బంధువులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

సెస్ కార్యాలయంలో విజిలెన్స్ తనిఖీలు

- రికార్డులను స్వాధీనం చేసుకున్న అధికారులు


సిరిసిల్ల సెస్ కార్యాలయంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

సిరిసిల్ల రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘంలో మంగళవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. సెస్‌లో జరుగుతున్న పలు అవినీతి అక్రమాలపై ఇటీవల పలువురు ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్ నుంచి విజిలెన్స్ సీఐ అనిల్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, ఏఈ శ్రీకాంత్‌గౌడ్‌లు బృందాలతో సెస్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలకు చెందిన పలు రికార్డులతో పాటు కంప్యూటర్‌లలో ఉన్న వివరాలను కాపీ చేసుకుని తీసుకెళ్లారు. దీనిపై సెస్ ఎండీని వివరణ కోరగా పలు ఫిర్యాదులకు సంబంధించి విచారణకు వచ్చి వారికి అనసరమైన రికార్డులను తీసుకెళ్లారని తెలిపారు.

వీఏవోపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న వీఏవోలు

గంభీరావుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గంభీరా వుపేట మండలం ముచ్చర్ల నూతన గ్రామ సంఘం వీవోఏ విస్లావత్ పద్మపై కొందరు దాడి చేసి గాయ పర్చారని, దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవా లని స్థానిక తహసీల్దార్ మారుతిరెడ్డికి మండల వీవోఏల సంఘం మండల అధ్యక్షురాలు కురాకుల దేవలక్ష్మి మంగళవారం పిర్యాదు చేసింది. ప్రభు త్వం మహిళా సంఘాలకు కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతలు అప్ప గించగా, ముచ్చర్ల వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద బాధ్యతలు నిర్వహిస్తున్న పద్మపై ఐదుగురు దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ విషయమై ఎస్ఐ అనిల్‌కుమార్‌ను అడగా, ఫిర్యాదు ఇచ్చిన రోజే వారిపై కేసు నమో దు చేశామని తెలిపారు.

గంజాయి స్వాధీనం

ముగ్గురు యువకుల అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, నవంబరు18(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని రాపల్లివాగు వంతెన వద్ద గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో వల పన్ని ముగ్గురు యువకులను పట్టుకుని అరెస్ట్ చేశామని సీఐ శ్రీనివాస్ మంగళవారం పేర్కొన్నారు. వారి వద్ద నుంచి 150 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనపర్చుకున్నామని తెలిపారు. సీఐ శ్రీనివాస్ కథనం మేరకు.. మండల కేంద్రంతో పాటు నారాయణపూర్ గ్రామాలకు చెందిన యువకులు మంద ప్రశాంత్, గనగోని అరవింద్, బుర్క సాయిరాజులు కలిసి కరీంనగర్ జిల్లాలోని గుర్తు తెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేస్తున్నారు. కొంత గంజాయిని తాగడంతో పాటు మిగిలిన దానిని మండలంలోని చుట్టు పక్కల గ్రామాలకు చెందిన యువకులు విక్రయిస్తున్నారు. మండల కేంద్రం శివారులోని రాపల్లి వాగు వంతెన వద్ద ఈ నెల 17న గంజాయి అమ్ముతున్నారనే సమాచారంతో ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ముగ్గురు యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాయని పేర్కొన్నారు. గంజాయి విక్రయాలు, సరఫరా, తాగే వారి వివరాలను 100 నంబర్‌కు సమాచారం అందించాలని సీఐ శ్రీనివాస్ కోరారు.

భూవివాదంలో బెదిరించిన ఐదుగురిపై కేసు

కరీంనగర్ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ గౌతమి నగరకు చెందిన 944/బిలోని 270 గజాల స్థలం వివాదంలో బెదిరింపులకు పాల్పడ్డారని మానకొండూర్ మండలం చెంజర్లకు చెందిన బోళ్ల సత్యనారాయణ ఫిర్యాదుతో ఐదుగురిపై కరీంనగర్ వన్‌టౌన్‌లో సోమవారం కేసు నమోదు చేసినట్లు సీఐ రాంచందర్‌రావు తెలిపారు. భూవివాదంపై మాట్లాడుకుందామంటూ ఈ నెల 12న తనను కరీంనగర్‌లోని సీపీఐ కార్యాలయానికి పిలిపించారని, బయటకు వెళ్లకుండా అడ్డుకొని బెదిరింపులకు పాల్పడ్డారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. స్థలం నుంచి ఖాళీ చేయకుంటే తీవ్రపరిణామాలుంటాయని, కాంపౌండ్‌ను కూల్చివేస్తామని బెదిరించారని తెలిపాడు. ఈ మేరకు పంజాల శ్రీనివాస్, కొయ్యడ సృజన్‌కుమార్, న్యాలపట్ల రాజు, బండ రాజిరెడ్డి, రాజశేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్న కేంద్రం

- సీపీఐ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

హుజూరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దోచిపెడుతోందని సీపీఐ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సీపీఐ వంద సంవత్సరాల ముగింపు ఉత్సవాల ప్రచార జాతా మంగళవారం హుజూరాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టులు శాంతిచర్చలకు సిద్ధంగా ఉన్నామని పదేపదే చెప్పిన కూడా కేంద్ర ప్రభుత్వం ఎన్‌కౌటర్లకు పాల్పడడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. శాంతి చర్చల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వ భద్రత విభాగాల వైఫల్యం వల్లనే కశ్మీర్, డిల్లీలో పేలుళ్ల జరిగాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కళావేన శంకర్, ఏఐయూఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, నాయకులు అనిల్, నర్సింహ, రెహమాన్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, కేదారి, బాబు, సృజన్‌కుమార్, లక్ష్మి, వెంకటేష్, అయిలయ్య, రత్నాకర్, మల్లేష్, సత్యనారాయణ, రాము, సాగర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

వేగవంతంగా పూర్తి చేయాలి

- హడ్కో రాష్ట్ర అధికారి జనార్దన్


మల్యాల మండలం సర్వాపూర్‌లో ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

మల్యాల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని హడ్కో రాష్ట్ర అధికారి జనార్దన్ పేర్కొన్నారు. పైలట్ ప్రాజెక్ట్ ద్వారా మల్యాల మండలంలోని సర్వాపూర్‌లో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మంగళవారం హడ్కో అధికారులు పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ ప్రగతిని స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద ప్రారంభించిన ఇళ్ల నిర్మాణాలు అన్ని పూర్తి చేసి గ్రామాన్ని ఆదర్శంగా ఉంచాలని అధికారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణాలు పెండింగ్‌లో ఉంచకుండా పూర్తి చేసేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించాలని అన్నారు. జిల్లా హౌసింగ్ పీడీ ప్రసాద్, అధికారులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలు ప్రారంభం

- రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట : జనక్‌ప్రసాద్


స్విమ్మింగ్ పోటీలను ప్రారంభిస్తున్న జనక్‌ప్రసాద్

రామగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం సెంటినరీకాలనీలోని సింగరేణి సౌజన్యంతో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలను మంగళవారం జనక్‌ప్రసాద్, గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మినిమం వేజ్‌బోర్డు చైర్మన్ జనక్‌ప్రసాద్, ఏసీపీ రమేష్‌లు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని అన్నారు. క్రీడలతో క్రమశిక్షణ, మంచి అలవాట్లు అలవడుతాయన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. పాఠశాలలో ఆటలకు ఒక పీరియడ్‌ను ప్రభుత్వం తప్పనిసరి చేసినట్లు తెలిపారు. ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా చూడాలన్నారు. సింగరేణి స్టేడియంలో సమాజ హితమైన పనులకు అవకాశం కల్పిస్తామన్నారు. అవసరమైన అన్ని వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ మాట్లాడుతూ మొదటి సారిగా రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీ లను పెద్దపల్లి జిల్లాలో నిర్వహించడం గర్వకారణ మని, రాబోయే రోజుల్లో మరి న్ని పోటీలను నిర్వహించే ప్రయత్నం చేస్తామన్నారు. జిల్లా యువజన క్రీడల అభివృ ద్ధి అధికారి అక్కపాక సురేష్, ప్రకాశం, రాష్ట్ర బాధ్యులు శోభారాణి, శ్రీనివాస్, పేట సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సురేందర్, దాసరి రమేష్, టోర్నమెంట్ అబ్జర్వర్ శ్రీనివాస్, అధికారులు శశికుమార్, శ్రీకాంత్, వ్యాయామ ఉపాధ్యాయులు శైలజ, మాధవి, జావీద్, వెంకటేష్, దుర్గాప్రసాద్, ఖాజాబీ, రేణుక, సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు 52 మంది ఎంపిక

సెంటినరీకాలనీ రాణిరుద్రమాదేవి క్రీడా ప్రాంగణంలో అండర్-14 రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు వేదికైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు ఉమ్మడి పది జిల్లాల నుంచి 277 మంది క్రీడాకారులు హాజరయ్యారు. తొలుత ఎంపిక పోటీలో 52 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యారు. అందులో 26 మంది బాలురు, 26 మంది బాలికలు ఉన్నారు. వీరికి సింగరేణి సిటూ టైప్ క్వార్టర్‌లను వసతి కోసం కల్పించింది. రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన క్రీడాకారులను ఈ నెల 30 ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొంటారని నిర్వాహకుడు లక్ష్మణ్ తెలిపారు.

చెరువులో బావి తవ్వకంపై విచారణ


బావి తవ్వకంపై విచారణ నిర్వహిస్తున్న అధికారులు

చందుర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామ శివారులోని కొత్త చెరువులో బావి తవ్వకంపై అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. గ్రామ శివారులోని కొత్తచెరువులో ఓ వ్యక్తి బావి తవ్వుతున్నాడని పోలీసులకు ఫిర్యాదు అందడంతో వారు పనులు నిలిపివేయించారు. మంగళవారం పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు ఆ ప్రదేశానికి వెళ్లి విచారణ చేపట్టారు. బావి తవ్వే వ్యక్తిని భూమి పట్టా సంబంధించిన పాసుబుక్‌లను తీసుకొని రావాల్సిందిగా సూచించినట్లు అధికారులు తెలిపారు. విచారణ జరిపిన వారిలో ఇరిగేషన్ ఏఈ నవీన్, ఆర్ఐ శ్రీనివాస్, ఏఎస్ఐ ఆనంద్, సర్వేయర్ చామంతి, ఇరిగేషన్ వర్క్ ఇన్స్‌పెక్టర్, మణికంఠ, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

నేడు వేములవాడలో హుండీ లెక్కింపు

వేములవాడ టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో నిండిన హుండీలను బుధవారం లెక్కిస్తామని ఆలయ ఏఈఓ బ్రహ్మన్నగారి శ్రీనివాస్ తెలిపారు. ఈ హుండీలను ఆలయ ఓపెన్ స్లాబ్‌లో భారీ భద్రత మధ్య లెక్కించనున్నట్లు ఆయన తెలిపారు.

ఎస్సారెస్పీకి స్వల్పంగా వరద

జగిత్యాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో మంగళవారం నీటి మట్టం నిలకడగా ఉంది. ఎగువ ప్రాంతం నుంచి 9,338 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 9,338 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

పంచాయతీ ఎన్నికల నిర్ణయం ఉపసంహరించుకోవాలి

- బీసీ సాధికారిత ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరేందర్

వేములవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరులో పంచాయతీ ఎన్నికలను పార్టీ పరంగా రిజర్వేషన్లతో నిర్వహించేందుకు కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని బీసీ సాధికారిత ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్ డిమాండ్ చేశారు. వేములవాడ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబరులో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లుల ఆమోదానికి రాష్ట్ర ఎంపీలు ఒత్తిడి తేవాలని, లేదా రాజీనామా చేసేందుకు సిద్ధపడాలని సూచించారు. ఈ సమావేశంలో చింతలోటి రామస్వామి, బుర్ర దశగౌడ్, హేలపతి, దేవయ్య, ఒన్నారపు దేవయ్య, గణేష్, తిరుపతి, ప్రభాకర్, రవీందర్, రాజేష్, నర్సయ్య తదితరులు ఉన్నారు.

కల్యాణ కట్ట.. సమస్యల తిష్ట

- పనిచేయని వేడినీళ్ల ప్లాంటు
- ఆరుబయటనే పుట్టువెంట్రుకలు
- కోడెల క్యూలైన్ పక్కనే నిర్మాణ సామగ్రి


కోడెల క్యూలైన్ పక్కనే నిర్మాణ సామగ్రి

ఇరుకైన కల్యాణకట్టలో తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు

వేములవాడ టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారికి తలనీలాలు సమర్పించే కల్యాణకట్ట సమస్యలకు తిష్టగా మారింది. కార్తీక మాసం సందర్భంగా వేలాదిమంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. రాజన్న సన్నిధిలో రూ.150కోట్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో రావిచెట్టు వద్ద ఉన్న కల్యాణకట్ట-1ను చెక్‌పోస్టు వద్దకు మార్చారు. మరో కల్యాణకట్ట-2ను అమ్మవారి గెస్ట్ హౌస్ వద్ద తాత్కాలికంగా టెంట్లువేసి కొనసాగిస్తున్నారు. ఈ కల్యాణకట్టను రాజేశ్వరపురం కిందిభాగంలో ఏర్పాటు చేయాలని రూపకల్పన చేసినప్పటికీ ముందుకు సాగడంలేదు. తలనీలాల కాంట్రాక్టు ద్వారా ఆలయానికి ఏటా రూ. 15కోట్ల ఆదాయం సమకూరుతోంది. ఈ కల్యాణకట్టలో భక్తులు తలనీలాలు సమర్పించడం ఇబ్బందిగా మారింది. కల్యాణకట్టలో భక్తులకు అవసరమైన కనీస సౌకర్యాలు కరువయ్యాయి. చిన్నారులకు పుట్టువెంట్రుకలు తీసేందుకు అవసరమైన నీడ కరువైంది. కల్యాణకట్టకు ఎదురుగా ఆరుబయటనే చిన్నారులకు పుట్టు వెంట్రుకలు తీస్తున్నారు. కల్యాణకట్ట వద్ద చిన్నారులకు వేడినీళ్లు లభించక చలికి విలవిలలాడుతున్నారు. పార్వతిపురం-1 బ్లాక్ వద్ద వేడినీళ్ల ప్లాంటు ఏర్పరిచి నప్పటికీ ఉపయోగపడడం లేదు. కల్యాణకట్టకు కొంత దూరంగా ఉండడంతో బయటనే వేడినీళ్లు తెచ్చుకొని చిన్నారులకు స్నానాలు చేయిస్తున్నారు. పార్కింగ్ ప్రాంతంలో ఏర్పాటుచేసిన నల్లాల వద్దనే భక్తులు స్నానాలు చేస్తున్నారు. ఇవి దూరంగా ఉండడంతో భక్తుల స్నానాలకు ఇబ్బందులు నెలకొన్నాయి. అసౌకర్యాల మధ్య భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు. రాజేశ్వరపురం చివరన కిందిభాగంలో భక్తుల స్నానాల కోసం ప్రత్యేక లైన్ ఏర్పరిచి నల్లాల పాయింట్ ఏర్పరిచారు. ఇప్పటివరకు ఫ్లోరింగ్ మొదలు పెట్టలేదు. భక్తుల సౌకర్యార్థం దాదాపు 120 నల్లాలను బిగించడానికి రూప కల్పన చేసినప్పటికీ కార్యరూపం దాల్చడంలేదు. సమ్మక్క, సారక్క జాతర సమీపిస్తున్న నేప థ్యంలో ఇప్పటికైనా పూర్తిసౌకర్యాలతో కల్యాణ కట్టను ఏర్పాటు చేసి భక్తుల ఇబ్బందులను తొలగించాల్సిన అవసరం ఉంది.

● ధర్మగుండం మూసివేత

ఆలయ విస్తరణ పనుల నేపథ్యంలో ధర్మగుండంను మూసివేశారు. అయితే కార్తీక మాసం సందర్భంగా భక్తులు పుణ్యస్నానాలకు చోటులేదు. భీమేశ్వరస్వామి ఆలయంలో దర్శనాలు, ఆర్జిత సేవలు చేసుకునే భక్తులు పుణ్యస్నానాలు చేయాలంటే వసతిగదులే తప్ప ఎక్కడా చోటు లేదు. ఆలయ పార్కింగ్ ప్రాంతంలో ఉన్న కొద్దిపాటి నల్లాల వద్ద స్నానాలు చేయడం భక్తులకు ఇబ్బందిగా మారింది. మహిళలకు డ్రెస్సింగ్ రూంలు లేకపోవడంతో కష్టంగా మారింది.

● భీమేశ్వరసదన్ ఎదుట బురదమయం

ప్రసాదాల తయారీతో వచ్చే నీటితో భీమేశ్వర సదన్ ఎదుట బురదమయంగా మారింది. భీమేశ్వరసదన్‌లోనే ఈవో, ఇంజనీరింగ్, ప్రొటోకాల్ కార్యాలయాలు ఉన్నాయి. ముఖ్య బుకింగ్‌కు పక్కన సదన్ ఎదుట బురదగా మారడంతో ఆలయానికి వచ్చే వీఐపీలు, కార్యాలయాలకు వెళ్లే అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ప్రత్యా మ్నాయ ఏర్పాట్లు చేయాల్సి ఉంది. మరోవైపు కోడెల క్యూలైన్ పక్కనే అభివృద్ధి పనులకు ఉపయోగించే ఇసుక, కంకర ఉండడంతో భక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు.


బురదగా మారిన భీమేశ్వర సదన్ ప్రధాన ద్వారం

కల్యాణకట్ట-2ను 20రోజుల్లో పూర్తిచేస్తాం

- రాజేష్, ఈఈ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం

కళ్యాణకట్ట-2ను 20రోజుల్లో పూర్తిచేస్తాం. భక్తుల స్నానాలుకు దాదాపు 120 నల్లాల ద్వారా షెవర్స్‌ను ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం కళ్యాణకట్ట-1లో తలనీలాలు సమర్పించే భక్తుల సౌకర్యార్థం వెనుకభాగాన నల్లాలు ఏర్పాటు చేశాం. ఇక్కడ త్వరలో ఫ్లోరింగ్ చేసి నల్లాలు వినియోగంలోకి తీసుకువస్తాం. ఇందుకు రూ. 15లక్షలు కేటాయించాం. భీమేశ్వర ఆలయంలో రూ. 3.60కోట్ల అభివృద్ధి పనుల నేపథ్యంలో నిర్మాణానికి క్యూలైన్ పక్కన వేసిన మెటీరియల్ తొలగిస్తాం.

బద్దిపోచమ్మ సన్నిధిలో భక్తుల సందడి

● అమ్మవారికి బోనం సమర్పించేందుకు చలిలోనే క్యూ


అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు బారులు తీరిన భక్తులు

వేములవాడ టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా వేములవాడ భీమేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన భక్తులతో బద్దిపోచమ్మ దేవాలయం వద్ద భక్తజన సందడి నెలకొంది. మంగళవారం వేములవాడ పట్టణంలోని బద్దిపోచమ్మ ఆలయంలో వేలాదిమంది భక్తులు అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు. చలిని సైతం లెక్కచేయకుండా భక్తులు తెల్లవారుజామునే క్యూ కట్టారు. వీధుల్లో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించడంతో భక్తులకు రెండు గంటల సమయం పట్టింది. బద్దిపోచమ్మ ఆలయం ఎదురుగానే నీటి గుంత ఏర్పడడంతో భక్తులు ఇబ్బందుల పాలయ్యారు.

భీమేశ్వరాలయంలో కార్తీక వైభవం

కార్తీకమాసం సందర్భంగా భీమేశ్వరాలయంలో కార్తీక వైభవం నెలకొంది. మంగళవారం భీమన్న సన్నిధిలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సుహాసినిలు కార్తీక దీపాలు వెలిగించి భక్తి ప్రపత్తిని చాటారు. అనంతరం సుహాసినిలకు వాయనం అందజేశారు.

బీడి కార్మికుల పిల్లల ఉపకారవేతనాలు

● ఈ నెల 30 వరకు గడువు పెంపు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ, వెల్ఫేర్ కమిషనర్, లేబర్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు బీడి కార్మికుల పిల్లలకు ప్రోత్సాహక ఉపకారవేతనాలు దరఖాస్తులు ఈ నెల 30 వరకు పొడిగించినట్లు జిల్లా బీడీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ ప్రభుత్వ ఆమోదిత కళాశాలలు ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ, బీఎస్సీ అగ్రికల్చర్, బీటెక్, ఎంబీఏ, ఎంబీబీఎస్, ఎంసీఏ కోర్సులు చదివే విద్యార్థులకు ఈ అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను ప్రోత్సహించి నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. విద్యార్థుల తల్లితండ్రులకు రూ. 1,20,000 లోపు ఆదాయం కలిగి ఉండాలని, గత సంవత్సర విద్యార్థి మార్క్స్ మెమో, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, తల్లి లేదా తండ్రి బీడీ కంపెనీ ఐడీ కార్డుతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

కొండగట్టులో భక్తుల రద్దీ


కొండగట్టులో భక్తులు

మల్యాల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో పోటెత్తింది. వేలాదిగా వచ్చిన భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనంకు బారులు తీరి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్తీకమాసంతో పాటు సమ్మక్క సారలమ్మ జాతర రానున్న నేపథ్యంలో అధిక సంఖ్యలో వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, అధికారులు పర్యవేక్షించారు. అంజన్నను దర్శించకున్న భక్తులు బేతాళుడు, శ్రీరాముని ఆలయంలోనూ పూజలు జరిపారు. కాడా వైజంక్షన్, ఘాట్ రోడ్డుపై వాహనాల రాకపోకలకు అరగంట సమయం పట్టడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ధర్మపురి క్షేత్రంలో ఘనంగా గోదావరి హారతి


ధర్మపురిలో గోదావరికి హారతి ఇస్తున్న మంత్రి అడ్లూరి తదితరులు


కోటిలింగాలలో సామూహిక సత్యనారాయణ వ్రతం చేస్తున్న భక్తులు

ధర్మపురి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 28వ రోజు మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గోదావరి నది వద్ద హారతి పూజల్లో పాల్గొన్నారు. అత్యంత గోదావరి నది మాతకు హారతి ఇచ్చి నదిలో కార్తీక దీపం వదిలి పెట్టారు, ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ జక్కు రవీందర్, మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, సీఐ రాంనర్సింహారెడ్డి, ధర్మకర్తలు ఏదులాపురం మహేందర్, గుడ్ల రవీందర్, రాపర్తి సాయికిరణ్, నేదునూరి శ్రీధర్, బాదినేని వెంకటేష్, ఒజ్జల సౌజన్యనరేందర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ ధర్మపురి వద్ద గోదావరి హారతి కార్యక్రమాన్ని నిర్వహించడం పరమ పవిత్రమని కార్యక్రమంలో పాల్గొడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. రాబోవు కాలంలో గోదావరి పుష్కరాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. గోదావరి నది వద్ద మురికి నీరు కలువకుండా సీవరేజి ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) ఏర్పాటు చేస్తామన్నారు.

కోటిలింగాలలో ప్రత్యేక పూజలు

వెల్గటూర్: కోటిలింగాల కోటేశ్వరస్వామి వారికి మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు భక్తితో కార్తీక దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలారు. అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మ, అన్వేష్ శర్మ, కార్తీక్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య స్వామి వారికి అభిషేకం, అర్చన, అన్నపూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కాంతారెడ్డి, ఆలయ చైర్మన్ పూదరి రమేష్, రాపాక కోటయ్య పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న టిప్పర్ పట్టివేత


పోలీసులు పట్టుకున్న టిప్పర్

రుద్రంగి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) రుద్రంగి మండల కేంద్రంలో మంగళవారం ఉదయం ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నారు. జగిత్యాల జిల్లా, కథలాపూర్ మండలం నుంచి రుద్రంగి మండల కేంద్రానికి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకుని చందుర్తి సర్కిల్ కార్యలయానికి తరలించారు. ఆక్రమంగా ఎవరైనా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

మానసాదేవి ఆలయంలో భక్తుల రద్దీ


మానాసాదేవి ఆలయానికి భారీగా తరలివచ్చిన భక్తులు

గన్నేరువరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాసింపేట మానసాదేవి ఆలయానికి కార్తీక మాసం చివరి మంగళవారం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులతో ఆలయ ప్రాగంణం కిక్కిరిసింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక కుంకుమ పూజలు, సత్యనారాయణ వ్రతాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కోనేటిలోని జంటనాగ శివలింగ ప్రతిమలకు జలాభిషేకం చేశారు. ఆలయ ఆవరణలో మహిళలు దీపాలను వెలిగించగంతో కార్తీక శోభను సంతరించుకుంది.

రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు

మల్యాల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని టి. కమలిని రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ మానస, పీఈటీ మధులిక తెలిపారు. సిల్వర్ మెడల్ సాధించిన కమలినిని పాఠశాలలో అభినందించారు.

గొర్రెల పెంపకందారుల కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన కార్యవర్గం

కరీంనగర్ రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షు డిగా కరీంనగర్ రూరల్ మండలం చేగుర్తికి చెందిన బాసవేని మల్లేశం యాదవ్ ఎన్నికయ్యారు. మంగళవారం జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో జిల్లా పశు వైద్య అధికారి లింగారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన జిల్లా పాలక వర్గాన్ని ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా అగిత రవీందర్, కటిక రెడ్డి బుచ్చన్న, కాల్వ సురేష్, గడ్డి శ్రీనివాస్, చిగుర్ల శ్రీనివాస్, చౌటపల్లి రంజిత్, దాడి అంజనేయులు, దాడి సదయ్య, దానె ఓదెలు, బద్దుల రాజ్ కుమార్, ముక్కెర సదానందం ఎన్నికయ్యారు.

సింగరేణి కార్మికుడి ఆత్మహత్య

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్ పరిధి వీర్లపల్లెలో మంగళవారం రాత్రి ఉరివేసుకుని అన్నబోయిన శ్యాంసుందర్(45) అనే సింగరేణి కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మందమర్రి ఏరియాలోని శాంతిఖని గనిలో జనరల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్యాంసుందర్ కొంతకాలంగా మద్యానికి బానిసై విధులకు గైర్హాజరు అవుతున్నాడు. దీంతో శ్యాంసుందర్ భార్య నాలుగు నెలల క్రితం కుమారుడిని తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి సక్రమంగా డ్యూటీలు చేయకుండా అతిగా మద్యం సేవిస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో మంగళవారం వీర్లపల్లె శివారులో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


వేములవాడలో పేరిణి శివతాండవ నృత్యం

వేములవాడ టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా వేములవాడ శ్రీ భీమేశ్వర సదన్ ఆవరణలో మంగళవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా కళాకారులు ప్రదర్శించిన పేరిణి శివతాండవ నృత్యం ఆకట్టుకుంది. కళాకారులు ప్రదర్శించిన ఆంధ్రనాట్యం అలరించింది. ఈ సాంస్కృతిక ప్రదర్శనల్లో ఆచార్య గురు కళాకృష్ణ ఆధ్వర్యంలో పుష్పాంజలి, దేవి స్తోత్రం, పంచలింగ స్తోత్రం , మేలప్రాప్తి, శివపంచలింగ శబ్దాలు తదితర నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రదర్శనలు తిలకించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కళాకారులు సత్కరించారు. అనంతరం కళాకారులను విప్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇవో రమాదేవి, డీఈలు రఘునందన్, మహిపాల్‌రెడ్డి, ఏఈఓ శ్రావణ్‌కుమార్, జయకుమారి, బ్రహ్మన్నగారి శ్రీనివాస్, జి. అశోక్‌కుమార్‌లు పాల్గొన్నారు.


ఆకట్టుకున్న ఆంధ్రనాట్య ప్రదర్శన

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



కల్యాణానికి హాజరైన భక్తులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండలం మానాల గ్రామంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణం మంగళవారం వైభవంగా జరిగింది. స్వామివారి కల్యాణానికి రాష్ట్ర యూనియన్ కోఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. స్వామి వారి కళ్యాణానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు, వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణం వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ చెలుకల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూం జలపతి, తర్రె మనోహర్ గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, జక్కు మోహన్, పిసరి చిన్నభూమయ్య ఉన్నారు.

భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

● ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి) : వేములవాడకు వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పించాలని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం భక్తులకు కల్పించాల్సిన వసతులపై జిల్లా ఇన్‌చార్జీ కలెక్టర్ గరిమా అగర్వాల్, ఎస్పీ మహేష్‌బీగీతే, వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ముందుగా భీమేశ్వరస్వామి ఆలయానికి రోజుకు ఎంతమంది భక్తులు వస్తున్నారని ఏఏ మొక్కులు చెల్లించుకుంటున్నారనని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ భీమేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్యకు అనుగుణంగా ఆలయంలో వసతులు కల్పించాలని సూచించారు. క్యూలైన్‌లు, వివిధ ప్రత్యేకపూజలు, మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం ముందు ఉన్నరావి చెట్టు వద్ద భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై చర్చించారు. ఈవో రమాదేవి, ఆర్డీవో రాధాబాయ్, ఆర్అండ్‌బీ ఈఈ నరసింహాచారీ, ఈఈ రాజేష్ పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో అధికారులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కోళ్ల వ్యర్థాలతో చేపల పెంపకం..

- చికెన్ సెంటర్ల నుంచి వ్యర్థాల సేకరణ
- పట్టించుకోని అధికారులు



రంగపేట గ్రామ శివారులోని చేపల చెరువు



ఇల్లంతకుంట నుంచి వాహనంలో తరలిస్తున్న కోళ్ల వ్యర్థాలు

ఇల్లంతకుంట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : ధనార్జనే ధ్యేయంగా కొంతమంది వ్యాపారులు కోళ్ల వ్యర్థాలతో చేపలు పెంచుతున్నారు. ఇల్లంతకుంట మండలంలోని రంగపేట గ్రామ శివారులో చేపల చెరువులు ఉన్నాయి. చేపలకు పెట్టవలసిన దాణా ఖర్చులు పెరగడం, దాణా తినడం వల్ల చేపలు బరువు ఎక్కువగా పెరగకపోవడంతో మండలకేంద్రంలోని చికెన్ సెంటర్ల నుంచి వ్యర్థాలను తీసుకొనిపోయి చేపలకు ఆహారంగా వేస్తున్నారు. ప్రతిరోజు ద్విచక్ర వాహనంపై కోళ్ల వ్యర్థాలను తీసుకొని పోతుండగా ఆదివారం మాత్రం ప్రత్యేకంగా ఆటోను తీసుకొని వచ్చి వ్యర్థాలను చెరువుల వద్దకు తరలిస్తుంటారు. ఈ కోళ్ల వ్యర్థాలను తిన్న చేపలు తొందరగా బరువు పెరుగుతుండగా, అవి తిన్న ప్రజలు మాత్రం ఆసుపత్రుల పాలవుతున్నారు. చేపల చెరువులో కోళ్ల వ్యర్థాలు కలుపడంపై యజమానులు మాట్లాడుతూ తాము పెంచేది రూప్‌చంద్ చేపలని, అవి ఇక్కడ విక్రయించడం లేదని, ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నామని పేర్కొంటున్నారు. చేపల చెరువులో కోళ్ల వ్యర్థాలను కలుపడం అనేక రోజులుగా కొనసాగుతున్నా మత్స్యశాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

మత్స్యశాఖ అనుమతులు ఒక్కదానికే..

రంగపేట శివారులో కేవలం ఒక్క చేపల చెరువుకు మాత్రమే మత్స్యశాఖ ద్వారా అనుమతులు తీసుకున్నారు. ప్రక్కనే ఏర్పాటు చేసిన మరికొని చెరువులకు ఎలాంటి అనుమతులు లేవు. చేపల చెరువుల ప్రక్కనే రంగపేట చెరువు ఉంది. చెరువులో యథేచ్ఛగా మోటార్లు వేసి నీటిని వినియోగించుకుంటున్నారు. వీరు చేస్తున్న వ్యాపారాన్ని చూసిన మరికొంత మంది సైతం చేపల చెరువులను నిర్మించాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది.

దాణా ద్వారా మాత్రమే చేపలను పెంచాలి..

- గొడుగు నర్సయ్య, ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు



చెరువుల్లో చేపలను పెంచే వారు తప్పనిసరిగా దాణాపెట్టి మాత్రమే పెంచాలి. ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసే కోళ్ల వ్యర్థాలను ఎట్టి పరిస్థితులలో వినియోగించరాదు. చేపలు తింటే ఆరోగ్యంగా ఉంటామని అందరు భావిస్తారు. ఇలాంటి చర్యల వల్ల చేపలు తినడానికి ప్రజలు వెనుకడుగు వేస్తారు. దీని వల్ల చేపలు పట్టుకొని జీవించే వారు ఉపాధి కోల్పోతారు. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం..

- సౌజన్య, జిల్లా ఫిషరీస్ అధికారి



చేపల పెంపకానికి ఉన్న నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. ఎవరైన అతిక్రమించినట్లయితే చర్యలు తీసుకుంటాం. చేపల పెంపకానికి కోళ్ల వ్యర్థాలు వినియోగిస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. వెంటనే విచారణ ప్రారంభిస్తాం. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోని చేపల చెరువులను పరిశీలిస్తాం. ప్రజల ఆరోగ్యంతో ఆటలు ఆడుకోవద్దు. ప్రభుత్వం క్యాట్‌ఫిష్ పెంపకాన్ని నిషేధించింది.

పేదలకు వైద్యం చేసేందుకు

యువ డాక్టర్లు ముందుకు రావాలి

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



వైద్య పరికరాలను పరిశీలిస్తున్న బండి సంజయ్‌కుమార్, కలెక్టర్ గరిమ అగ్రవాల్

వేములవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా డాక్టర్ విద్యను పూర్తిచేసిన యువ వైద్యులు పేదలకు వైద్యం అందించేందుకు ముందుకురావాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం వేములవాడ పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో ఇన్‌చార్జికలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో సీఎస్సార్ నిధులతో కొనుగోలు చేసిన రూ.1.5కోట్ల విలువైన వైద్య పరికరాలను ఆసుపత్రికి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బండి సంజయ్‌కుమార్ మాట్లాడారు. జిల్లాలో డాక్టర్ల రిక్రూట్‌మెంట్ కోసం కలెక్టర్ 89 వైద్య పోస్టులు భర్తీ కోసం నోటిఫికేషన్ ఇచ్చారని, యువ డాక్టర్లంతా దరఖాస్తు చేసుకుని ఉద్యోగాలు పొందాలని కోరారు. కరీంనగర్ నుంచి వేములవాడ ఎంతోదూరం కూడా లేదని, ఉద్యోగాల్లో చేరి ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు సేవ చేయాలని కోరుతున్నామన్నారు. అర్బన్ నక్సల్స్ మాయలో పడి మావోయిస్టులు మోసపోయి ప్రాణాలు కోల్పోవద్దన్నారు. అర్బన్ నక్సల్స్ పట్టణాల్లో కుటుంబ సభ్యులతో కలిసి జల్సా చేస్తున్నారని, ప్రభుత్వంతో అర్బన్ నక్సల్స్ కుమ్మక్కై నామినేటెడ్ పోస్టులు, కమిషన్‌లు, పదవులు అనుభవిస్తున్నారని, వాళ్ల మాయమాటలకు లోనైన అమాయక దళిత, గిరిజనులు మాత్రం తుపాకీ పట్టుకుని అడవుల్లో తిరుగుతూ ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. భారతదేశంలో జాతీయ జెండాను ఎగరవేయవద్దని, నల్ల జెండాలను ఎగరవేయాలని నక్సల్స్ చెబుతున్నారని, నల్ల జెండాను పాకిస్తాన్, బంగ్లాదేశ్ దేశాల్లో ఎగరవేయాలని చెప్పాలని సూచించారు. బుల్లెట్‌ను నమ్ముకుని ఏమి సాధించలేరని, సాధించబోరని, ఇప్పటి వరకు ఏమి సాధించారని ప్రశ్నించారు. నక్సల్స్ బుల్లెట్లను నమ్ముకుంటే.. మోదీ బ్యాలెట్‌ను నమ్ముకుని మూడుసార్లు విజయవంతంగా అధికారంలోకి వచ్చామని తెలిపారు. తుపాకులు బార్డర్‌లో జవాన్ వద్ద, పోలీసుల వద్ద తప్ప మరేవ్వరి వద్ద ఉండటానికి వీలులేదనేది, హోంశాఖ మంత్రి అమిత్‌షా దాన్ని సహించబోరని అన్నారు. వచ్చే మార్చి నాటికి మావోయిజాన్ని అంతం చేసి తీరుతామని అమిత్‌షా నిర్ణయం తీసుకున్నాడని, నక్సల్స్‌కు మరో నాలుగు నెలలు గడువు ఉందని, తుపాకులను వీడి జనజీవన స్రవంతిలో కలువాలని పిలుపునిచ్చారు. జనంలో కలిసి సమాజంలో మార్పు తీసుకురావాలని సూచించారు. ఇప్పటికైనా వాస్తవాలను గ్రహించాలని, నక్సల్స్ సిద్ధాంతాలను ప్రజలు నమ్మడం లేదన్నారు. తుపాకీ పట్టుకుని చర్చలు జరుపుతామంటే ఒప్పుకునే ప్రసక్తే లేదని, తుపాకీ వీడాల్సిందేనని, జనజీవన స్రవంతిలో కలవాల్సిందే అని, తుపాకీ వదిలి జనంలోకి వచ్చే వారికి కేంద్రం పూర్తిగా సహకరిస్తుందని సూచించారు. వారి వెంట ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ పెంచలయ్య, బీజేపీ నేత ప్రతాప రామకృష్ణ, చెన్నమనేని వికాస్‌రావు, ఎర్రం మహేష్, రాపెల్లి శ్రీధర్ తదితరులు ఉన్నారు.

'పల్లెపోరు'వైపు నేతల చూపు

(5వ పేజీ తరువాయి)

అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు, 401 నుంచి 650 వరకు ఉంటే ప్రిసైడింగ్ అధికారితో పాటు ముగ్గురు పోలింగ్ అధికారులను నియమిస్తారు. గ్రామాల్లో వార్డుల వారీగా ఓటరు జాబితాలను రూపొందించే క్రమంలో ఒకే కుటుంబంలోని ఓటర్లందరూ ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండే విధంగా సవరించారు. కొత్త ఓటర్లను జాబితాలో చేర్చి, మృతిచెందిన ఓటర్ల పేర్లను జాబితాల నుంచి తొలగించారు. జిల్లాలో గ్రామపంచాయతీ సంబంధించి తుది ఓటరు జాబితాల ప్రకారం ఓటర్లు 3 లక్షల 53 వేల 351 మంది ఉన్నారు. ఇందులో పురుషులు 170772 మంది, మహిళలు 182559 మంది ఉన్నారు. ఇందులో పురుషుల కంటే మహిళా ఓటర్లు 11787 మంది అధికంగా ఉన్నారు.

పారిశుధ్య కార్మికులు డ్రగ్స్ వారియర్స్‌గా పనిచేయాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ ఖాదీర్‌పాషా

సిరిసిల్ల టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కార్మికులు పారిశుధ్య వారియర్స్‌గానే కాకుండా డ్రగ్స్ వారియర్స్‌గా కూడా పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ ఎండీ ఖాదీర్‌పాషా అన్నారు. మంగవారం సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులకు మాదకద్రవ్యాల(డ్రగ్స్)పై అవగాహన కల్పించారు. అనంతరం సిబ్బంది, పారిశుధ్య కార్మికులతో కమిషనర్ ఖాదీర్‌పాషా మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది, కార్మికులు, కుటుంబ సభ్యులు మాదకద్రవ్యాలకు దూరం ఉండాలన్నారు. సిరిసిల్ల పట్టణంలో మాదక ద్రవ్యాలకు బానిసలైన వారిని గుర్తించి పోలీసులకు లేద మున్సిపల్ సానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. వారు డ్రగ్స్ డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించి మాదకద్రవ్యాల నుండి వారిని కాపాడుతారని అన్నారు. ప్రతి ఒక్కరు దీనిని సామాజిక బాధ్యతగా స్వీకరించి మాదక ద్రవ్యాల నిరోధకతకు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పారిశుధ్యకార్మికులు పాల్గొన్నారు.

కాగా, మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో నమస్తే స్కీంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు లైవరీ(సబ్బులు, కొబ్బరినూనె, బట్టలు, గ్లౌజ్‌లు, పనిముట్లు వస్తువులు)ను కమిషనర్ ఖాదీర్‌పాషా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

సిరిసిల్ల టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెక్‌ముకి టాలెంట్ టెస్టును నిర్వహించారు. ప్రశ్న పత్రాలను, వాల్ పోస్టర్‌ను ప్రధానోపాధ్యాయుడు రవీందర్, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రతినిధి పాకాల శంకర్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈనెల 21న మండల స్థాయి, 28న జిల్లా స్థాయి చెక్‌ముకి టాలెంట్ టెస్టు పోటీలు ఉంటాయన్నారు. కరీంనగర్‌లో డిసెంబర్ 12 నుంచి 14వరకు రాష్ట్రస్థాయి చెక్‌ముకి సైన్స్ సంబరాలు ఉంటాయన్నారు. పోటీల అనంతరం మండల స్థాయి పోటీలకు ఎంపికైన ఓ నిశాంత్, డి హిమవంత్, ఏ రేఖశ్రీలను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు కోల సరిత, ఆకుల శ్రీహరి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేసుకోవాలి

కోనరావుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇండ్లను త్వరిత గతిన పూర్తిచేసుకోవాలని ఎంపీడీవో స్నిగ్ధ రెడ్డి కోరారు. కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను, తెగిపోయిన మూలవాగు కాజ్‌వేలను పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాసాల మల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సతీష్ తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి : డీపీఎం



పోతుగల్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఎం రవీందర్

ముస్తాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వి రవీందర్ పేర్కొన్నారు. మండలంలోని పోతుగల్‌లోగల ఐకేపీ వరిధాన్యపు కొనుగోలు కేంద్రాన్ని డీపీఎం వి రవీందర్ పరిశీలించారు. కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటివరకు 17ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 116650 క్వింటాళ్ల ధాన్యాన్ని 1890మంది రైతుల వద్ద కొనుగోలు చేశామన్నారు. ఐకేపీ సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తలారి రాణి నర్సింలు, ఏపీఎం కల్యాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

సిరిసిల్ల టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఏఐఎస్ఎఫ్ 4వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుర్ర రాకేష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏఐఎస్ఎఫ్ 4వ జిల్లా మహాసభ కరప్రత్రాన్ని నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాకేష్, కార్యదర్శి మంద అనిల్‌కుమార్ మాట్లాడారు. వేములవాడ పట్టణంలో డిసెంబర్ 3, 4 తేదిలలో ఏఐఎస్ఎఫ్ 4వ జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నామన్నారు. ఏఐఎస్ఎఫ్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు బాధ గోపి, జిల్లా ఉపాధ్యక్షుడు పెండెల ఆధిత్య, నాయకులు గౌరవేణి రాజయ్య, పందుల అనిల్, శివసాయి, మనోజ్, నవీన్ పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ వసతిగృహం వంటమనిషి హఠాన్మరణం

వేములవాడ టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణం తిప్పాపూర్‌లోని బీసీ సంక్షేమ వసతిగృహంలో వంటమనిషిగా పనిచేస్తున్న సిహెచ్ మహేశ్వరి(50) అనే వంటమనిషి మంగళవారం గుండెపోటుతో మృతి చెందింది. 2010నుంచి వంటి మనిషిగా పనిచేస్తున్న మహేశ్వరికి గత 9మాసాలుగా వేతనం రావడంలేదు. బీసీ సంక్షేమ వసతి గృహంలో ఉదయం విధుల్లో ఉన్న వంటమనిషికి అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో సిబ్బంది ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వేతనం రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పెరిగి మనోవేదన గురికావడంతో గుండెపోటుతో మృతిచెందిందని కుటుంబసభ్యులు ఆరోపించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

చందుర్తి నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల విద్యాధికారి వినయ్‌కుమార్ అన్నారు. చందుర్తి మండలం సనుగుల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఎంఈవో వినయ్ కుమార్ మధ్యాహ్న భోజనాన్ని తనిఖీచేశారు. వెంట ప్రధానోపాధ్యాయులు ముఖేష్, ఉపాధ్యాయులు నాగమణి, శ్రీనివాస్, ఉన్నారు.

నర్సరీల్లో ప్రతి మొక్క ఎదిగేలా చూడాలి

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నర్సరీల్లో ప్రతి మొక్క ఎదిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీవో శ్రీలేఖ అన్నారు. వీర్నపల్లి మండలం బాబాయిచెరువు నర్సరీని మంగళవారం ఆమె సందర్శించారు. వెంట పంచాయతీ కార్యదర్శి రణధీర్, ఈజీఎస్‌సిబ్బంది వనిత, రాజు ఉన్నారు.

దీర్ఘకాలిక రుణాలు చెల్లించి సంస్థకు సహకరించాలి

- కేడీసీసీ బ్యాంకు జనరల్ మేనేజర్ శ్రీధర్

వేములవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, కేడీసీసీ బ్యాంకుల్లో తీసుకున్న దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలను సకాలంలో చెల్లించి సంస్థకు సహకరించాలని కేడీసీసీ బ్యాంకు జనరల్ మేనేజర్ శ్రీదర్ అన్నారు. వేములవాడ పట్టణంలోని కేడీసీసీ బ్యాంకులో ఉద్యోగులు, ఖాతాదారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదర్ మాట్లాడుతూ వేములవాడ కేడీసీసీ బ్యాంకు పరిధిలోని చందుర్తి, రుద్రంగి, కొనరావుపేట, బొయినపల్లి, వేములవాడ, వేములవాడ రూరల్ మండలాల్లోని ఖాతాదారులు తీసుకున్న దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలను సకాలంలో చెల్లించి అధికారులకు సహకరించాలని సూచించారు. ఆర్‌బీఐకి ట్రాన్స్‌ఫర్ చేయబడిన డీఈఎఎఫ్ అమౌంట్ తిరిగి అకౌంట్ జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కేడీసీసీ బ్యాంకు అందిస్తున్న అధిక వడ్డీని డిపాజిట్ దారులకు తెలియజేసి అధిక డిపాజిట్‌లు చేసేందుకు కృషి చేయాలని తెలిపారు.

ఈ సమావేశంలో డీజీఎమ్ రోహిణి, ఏజీఎంలు నరసింహరెడ్డి, నాగరాజు, ప్రాథమిక సంఘం కార్యదర్శులు మిట్ట లక్ష్మణ్, వినేష్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే గౌరవ వేతనం చెల్లించాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు గౌరవ వేతనం చెల్లించాలని మంగళవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఫ్ జిల్లా అధ్యక్షుడు పర్కాల రవీంద్‌గౌడ్ మాట్లాడారు.గత సంవత్సరం అక్టోబరు, నవంబరు నెలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులతో చేయించిందన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్వ హించిన సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు గౌరవ వేతనం రాలేదన్నారు. జిల్లా వ్యాప్తం గా దాదాపు రూ.54లక్షలు పెండింగ్‌లో ఉన్న ఈ బిల్లు ఇప్పటికి కూడా ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉందని ప్రభుత్వం చొరవ తీసుకోవాలని నిధులను విడుదల చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ద్వారా ప్రభుత్వానికి వినతిపత్రం అందించామన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కూడా దీనిపై ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లును విడుదల చేయించాలని విజ్ఞప్తి చేశామన్నారు.

ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగిటి రాజు, కోశాధికారి అంబటి రమేష్, జిల్లా కార్యదర్శులు, మొలిగె శంకరయ్య, గాలిపెల్లి సంతోష్, వద్యారం మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రతిజ్ఞ

గంభీరావుపేట, నవంబరు 18 (ఆంధ్ర జ్యోతి) గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళా శాల ఆవరణలో మంగళవారం నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో బాగంగా డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలనే సంకల్పంతో మాదక ద్రవ్యాల నివారణపై ప్రతిజ్ఞ చేశారు. డ్రగ్స్ వాడకం, అమ్మటం, కొనడం నేరమని ఉన్నతమైన ఆదర్శాలతో నేటి యువత దేశ భవిష్యత్‌ను నిర్దేశించేలా ఉండాలని ప్రిన్సిపాల్ విజయలక్ష్మి ఈ సం దర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్, అధ్యాపకులు, విద్యార్థినీవిద్యార్థులు ఉన్నారు.

● చందుర్తి నవంబరు 18 (ఆంధ్ర జ్యోతి): మాదకద్రవ్యాలను నిర్మూలించాలని ప్రధానోపాధ్యాయులు ముఖేష్ అన్నారు. చం దుర్తి మండలం సను గుల గ్రామంలోని ప్రాథ మిక పాఠశాలలో మంగళవారం మాదక ద్రవ్యాల వాడకాన్ని నిషేధించా లని విద్యార్థులు, ఉపా ధ్యాయులు ప్రతిజ్ఞ చేశా రు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మేకల పద్మ,కోరెపు శ్రీనివాస్,న్యాతరి నాగమణి, చిం తల హరిప్రియ,మాదవి నవ్య పాల్గొన్నారు.

ఆంధ్ర సారస్వత పరిషత్ పురస్కారం

సిరిసిల్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష పరిరక్షణ కోసం కృషి చేస్తున్న జిల్లా కేంద్రంలోని సృజన్ పిల్లల ఆసుపత్రికి ఆంధ్ర సారస్వత పరిషత్ సేవా పురస్కారాన్ని మంగళవారం ప్రకటించింది. బాల సాహితీవేత్త, ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందేపి రాణీప్రసాద్ ఆసుపత్రికి వచ్చేవారికి వివిధ అంశాలపై అవగాహన కల్పించడమే కాకుండా తెలుగు భాష పరిరక్షణ కోసం ప్రత్యేకంగా కృషి చేస్తున్నందుకు పురస్కారం అందుకోనున్నారు. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా పురస్కారాన్ని ప్రకటించడం ఆనందంగా ఉందని డాక్టర్ కందేపి ప్రసాదరావు, డాక్టర్ రాణీప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.

స్థల పరిశీలన

ఇల్లంతకుంట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : మండలంలో కొత్తగా ఏర్పడిన తాళ్లల్లపల్లె గ్రామపంచాయతీ కార్యాలయ భవనం కోసం ఎంపీడీవో శశికళ మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మీసాల నాగరాజు, నూనె శ్రీనివాస్‌యాదవ్, గుర్రాల రాజయ్య, ఇరుముల్ల నర్సయ్య, చందు ఉన్నారు.

దేశాభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర కీలకం

- నాప్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌రావు

గంభీరావుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ అభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర కీలకమని నాప్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. గంభీరావుపేట సింగిల్‌విండో కార్యాలయంలో అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కొండూరు రవీందర్‌రావు మాట్లాడుతూ సహకార వ్యవస్థల రూపకర్త జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని వారోత్సవాలను నిర్వహించుకుంటున్నామన్నారు. సహకార సంఘాలు ఎంత పటిష్టంగా ఉంటే దేశం ఆర్థికంగా అంత అభివృద్ధి చెందుతుందన్నారు. సహకార సంఘాల సభ్యులే యజమానులని వెల్లడించారు. సమష్టి కృషితో సంఘాలను మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో సహకార సంఘాలు ప్రగతి బాటలో పయనిస్తున్నాయ న్నారు. కార్యక్రమంలో డీసీవో రామకృష్ణ, కేడీసీసీబీ డైరెక్టర్ భూపతి సురేందర్, అసిస్టెంట్ రిజిస్టర్ రమాదేవి, బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, సీఈవో రాజిరెడ్డి,వైస్‌చైర్మన్ రామాంజనేయులు, సెస్‌డైరెక్టర్ నారాయణరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కార్యవర్గం

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, నవంబరు18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల కార్యవర్గాలను మంగళవారం ఎన్నుకున్నారు. ఎల్లారెడ్డిపేట మండల శాఖ అధ్యక్షుడిగా తుమ్మనపెల్లి నరేశ్, ప్రధానకార్యదర్శిగా కోటగిరి లక్ష్మణ్‌లు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా పసుల సత్తయ్య, ఉపాధ్యక్షురాలిగా సుతారి పద్మ, కోశాధికారిగా బొల్లి నవీన్, కార్యదర్శులుగా చింతల భాస్కర్, కల్లెపల్లి రూప, ఆడిట్ కమిటీ సభ్యురాలిగా అలువాల నవ్యలను ఎన్నుకున్నారు. వీర్నపల్లి మండల అధ్యక్షుడిగా చేకూటి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా కముటం శేఖర్‌లు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కలకుంట్ల రవి, కందుకూరి రజితాదేవీ, కోశాధికారిగా కన్నం జనార్ధన్‌లను ఎన్నుకున్నారు. సంఘం బాధ్యులు శివకుమార్, ప్రవీణ్, రాజు, తిరుపతిజాదవ్ పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటాలి

ఎల్లారెడ్డిపేట, నవంబరు18(ఆంధ్రజ్యోతి): రానున్న పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేసి అత్యధిక సర్పంచ్, వార్డు స్థానాలను కేవసం చేసుకుని సత్తా చాటాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట మండలాల్లోని గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీ మద్దతుదారుల గెలుపునకు కృషి చేయాలని అన్నారు. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు నాయకులు, కార్యకర్తలు అవగాహనతో మెదలాలని అన్నారు. కష్టపడిన వారిని గుర్తించి తగిన ప్రాధాన్యం ఇవ్వనుందని పేర్కొన్నారు.

సమస్యలపై దశలవారీ పోరాటాలు



సెస్ చైర్మన్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న సీఐటీయూ నాయకులు

సిరిసిల్ల రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల సెస్‌లో పనిచేస్తు న్న అసిస్టెంట్ హెల్పర్ల సమస్యలను పరిష్కారించే వరకు దశలవారిగా పోరా టాలు చేస్తామంటూ సీఐటీయూ నాయకులు తెలిపారు. మంగళవారం కార్యాల యం ఎదుట సీఐటీయూ తెలంగాణ యూనైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సీఐటీయూ నాయకులతో కలిసి అసిస్టెంట్ హెల్పా ర్‌లు నల్లబ్యాడ్జీలతో నిరసనలు తెలిపారు. మంగళవారం సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణల ఆధ్వర్యంలో అసి స్టెంట్ హెల్పర్లు సెస్‌చైర్మన్ చిక్కాల రామారావుతో పాటు ఎండి సుబ్బా రెడ్డిలను సమస్యలకు పరిష్కరించే వరకు దశల వారీగా పోరాటాలు చేస్తా మంటూ వినతి పత్రాలను అందించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ మాట్లాడుతూ అసిస్టెంట్ హెల్పర్ల సమస్యలను పరిష్కరించాలంటూ ఈనెల 24న సోమవారం సెస్ కార్యాలయం ఎదుట అసిస్టెంట్ హెల్పర్‌లతో భారీ ధర్నా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీయూఈఈయూ నాయకు లు మల్లేశం, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

●ఇల్లంతకుంట : సెస్‌పరిధిలో పనిచేస్తున్న హెల్పర్లకు ప్రమోషన్లు ఇవ్వాలంటు అసిస్టెంట్ హెల్పర్లు నిరసన వ్యక్తం చేశారు. మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో పనిచేస్తున్న అసిస్టెంటు హెల్పర్లు మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించిన నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని సెస్‌కార్యాలయానికి వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లారు. కార్యక్రమంలో ప్రశాంత్, తిరుపతి, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన గవర్నర్



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న గవర్నర్

సిరిసిల్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంస్కృ తి సంప్రదాయాలకు అద్దంపట్టే విధంగా సిరిసిల్లకు చెంది న అంతర్జాతీయ ఫొటో గ్రాఫర్ ఎంసి శేఖర్ రూపొందిం చిన 2026 సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం హైదరాబాద్ రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆవిష్కరించారు. గిరిజన యోధుడు బిర్సా ముండా జయంతి ఉత్సవాల్లో భాగంగా అంతర్జాతీయ ఫొటోగ్రాఫర్ ఎంసి శేఖర్ దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న గిరిజనుల జీవనశైలిపై క్యాలెండర్ రూపొందించారు. క్యాలెండర్ ఆవిష్కరించి పరిశీలించిన గవర్నర్ గిరిజ నుల ఆచార వ్యవహారాలను కళ్లకు కట్టినట్లు చిత్రీకరించారని ఎంసి శేఖర్‌ను అభినందించారు.